ఆలయ ద్వారానికి వెండి తొడుగు



ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రామాలయంలో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి ఏర్పాటు చేసిన వెండి తొడుగు ద్వారాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ప్రారంభించారు. ఆ ద్వారాన్ని అందజేసిన దాతలు రాధాకృష్ణమూర్తి, ఝాన్సీ భాయ్ దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆంజనేయులు, ప్రభాకర్ గౌడ్, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారి శాంతి కల్యాణం



శాంతి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని శ్రీలా పార్క్ ప్రైడ్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం శ్రీవారి శాంతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ నాయకులు కొండల్‌రావు, దామోదర్‌రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆదిత్య, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ డివిజన్ల పరిధి, సాయినగర్‌లోని నిస్సీ ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిస్సీ ఫెయిత్ మినిస్ట్రీస్ ఫౌండర్ మోజెస్ కొర్నీ మాట్లాడుతూ... రక్తదాన శిబిరం తలసేమియా రోగుల సహాయార్థం నిర్వహించామన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేకమంది ప్రాణాలైనా కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. శిబిరంలో సుమారు 72 మంది యువతీయువకులు పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ 1–ఫేజ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశం, సెక్రటరీ చారి, కొత్తపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లోని సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ సాధుప్రతాప్ రెడ్డి ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పుష్పరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్, నేతలు గొట్టిముక్కల జస్వంత్ రావు, మధుగౌడ్, మేకల రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, కాంగ్రెస్ యూత్ నాయకులు శివా చౌదరి, రమణ, బీ బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, మహిళాధ్యక్షురాలు రజిత, జ్యోతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కేపీహెచ్‌బీ తహసీల్దార్ కార్యాలయంలో 80 మంది లబ్ధిదారులకు, బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 145 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



కేపీహెచ్‌బీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో...



వివేకానందనగర్, రామకృష్ణవీధిలో కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం



బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్‌లో...

ఘనంగా కార్మిక దినోత్సవం

కార్మిక దినోత్సవం మేడే వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలు పార్టీల నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొని కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... ఏ వ్యవస్థ అయినా ముందుకు వెళ్లాలంటే శ్రామికుడు చెమట చిందించాల్సిందేనన్నారు. వారి సేవలు గుర్తించి వారిని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరినీ గౌరవించాలని స్పష్టం చేశారు. మేడే వేడుకల సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు వాడవాడలా కార్మిక జెండాలను ఆవిష్కరించారు. పలు ప్రాంతాల్లో జెండాలను చేతబూని ర్యాలీలను నిర్వహించారు. – కూకట్‌పల్లి జోన్ బృందం



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జెడ్‌సీ అపూర్వ చౌహాన్



జీహెచ్‌ఎంసీ కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ నేతలు



బాలాజీనగర్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లిలో సీఐటీయూ జిల్లా నాయకులు



కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు



మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో ఐఎన్‌టీయూసీ నేతలు



హరినగర్‌లో అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



సామాజిక కార్యకర్త దుత్త రవీంద్రరాగూర్ ఆధ్వర్యంలో...



సీఐడీ గ్రీన్ ల్యాండ్ విద్యుత్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

పేదల ఇళ్లు కూల్చితే సహించం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, మాధవరం కాంతారావు

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: ప్రైవేట్ భూముల స్వాధీనం, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేసే విధంగా ప్రభుత్వం కుట్రలు చేస్తే సహించమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. గురువారం కూకట్‌పల్లిలో నల్ల చెరువులో పట్టాదారుల స్థలాల్లో హైడ్రా అధికారులు తవ్వకాలు జరపడాన్ని వ్యతిరేకిస్తూ పట్టాదారులకు మద్దతుగా చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... కోర్టు ఆదేశాలను ధిక్కరించి హైడ్రా అధికారులు పనులు చేపడితే సహించేది లేదని అన్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిపై యాజమాన్య హక్కులు కలిగిన పట్టాదారులకు నష్ట పరిహారం చెల్లించకుండా చేపడుతున్న పనులను నిలిపివేయాలని హైడ్రాకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. కూకట్‌పల్లి గ్రామ సర్వే నెంబర్ 27 నుంచి 80 వరకు పట్టా భూములు ఉన్నాయని 7.38 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతాది పట్టా భూముల్లో నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ విస్తరించి ఉందన్నారు. చెరువు చుట్టు పక్కల ఉన్న 22 ఎకరాల పట్టా భూమి అనాదిగా పూర్తి యాజమాన్యపు వ్యవసాయ పట్టా హక్కులతో రైతులు వ్యవసాయం, అనుబంధ పాడి, కూరగాయలు సాగు చేసుకుంటూ భూములను జీవనోపాధిగా మార్చుకున్నారన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిని శాస్త్రీయంగా నిర్ధారించడంతో పాటు భూములకు చట్టబద్ధంగా నష్టపరిహారం అందించాలని పలుమార్లు హైడ్రా అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోకుండా పట్టా భూముల్లో కొద్ది రోజులుగా హైడ్రా అధికారులు మట్టి తీసే పనులు చేపడుతున్నారన్నారు. కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మకం



మోతీనగర్ చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహిస్తున్న నేతలు

మోతీనగర్: దేశవ్యాప్త కులగణనకు అనుమతించిన ప్రధాని నరేంద్రమోదీ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డింగిల్కర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మోతీనగర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఓబీసీ తరఫున మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మేడ్చల్ నాయకులు సతీష్ కుమార్, పిట్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో స్కూల్ కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ తదితరులు

మూసాపేట: మూసాపేటలోని సంతోష్ దాబా హోటల్‌లో గురువారం పంచశీల స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2008–09వ బ్యాచ్ విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ... 10వ తరగతి విద్యార్థుల స్నేహం కలకాలం కలిసి ఉండాలని, మనస్పర్థలతో దూరం కాకూడదు అన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న వారు పేద విద్యార్థులకు సహాయం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సంతోష్, రూప, శాలిని, విజయలక్ష్మీ, సూరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాలనీలు, బస్తీల్లో వివిధ సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సూచించారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్‌లోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ నందక అడ్వాన్స్ సర్జరీ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, దీపరేఖ కోడూర్ ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనాలు సలహాలను అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామలింగచారి, నేతలు సాయిలు, సుందర్, అశోక్, ఐలేష్, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

అధిక మోతాదులో మాత్రలు మింగి యువతి ఆత్మహత్య

మియాపూర్: మానసికస్థితి సరిగా లేని యువతి అధిక మోతాదులో మందులు (టాబ్లెట్స్) మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న కె.విజయలక్ష్మీ బీడీఎల్‌లో ఉద్యోగం చేస్తుంది. వీరికి ఇద్దరు కూతుర్లున్నారు. రెండవ కూతురు వైశాలి(27) సంవత్సరం నుండి మానసికస్థితి సరిగ్గా లేక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉంది. రోజు మాదిరిగానే విజయలక్ష్మీ బుధవారం విధులకు వెళ్లి సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి రాగా డోర్ లాక్‌చేసి ఉంది. కూతురు వైశాలిని ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఆమె మరో తాళం చెవితో తలుపు తీసి లోపలికి వెళ్లిచూడగా బెడ్‌రూమ్‌లో వైశాలి అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో తల్లి విజయలక్ష్మీ వైశాలిని దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. వైశాలి రోజు వేసుకునే టాబ్లెట్లను అధిక మోతాదులో వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. అమ్మా, అక్కా నన్ను క్షమించండి నా మా నసిక పరిస్థితి బాగాలేక మీకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నా.. అనుకున్న లక్ష్యా న్ని చేరలేకపోతున్నానని సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లి విజయలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధి వ్యాపారుల ప్రగతికి 'స్వనిధి' దోహదం



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన వీధి వ్యాపారులకు చిన్న రుణాలు అందించే పీఎం స్వనిధి పథకం అమలులో భాగంగా అధికారులు, వీధి వ్యాపారుల కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ... పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారులకు చిన్నపాటి రుణాలు అందించే ఒక బృహత్తర పథకం అని అన్నారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులు తమ వ్యాపారాన్ని పునరుద్ధరించడానికి, ఆర్థికంగా ప్రగతి సాధించేందుకు ఉపకరిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రూ. 10 వేల వరకు రుణం పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు ఎలాంటి భద్రత లేకుండా రుణాలు లభిస్తాయన్నారు. ఈ రుణాలకు 7 శాతం వడ్డీ రేటు వర్తిస్తుందని తెలిపారు. వీధి వ్యాపారులకు చిన్న రుణాలు అందించడం ద్వారా వారి వ్యాపారాన్ని పునరుద్ధరించడానికి, విస్తరించుకోవడానికి సహాయం చేయటం, వీధి వ్యాపారులను ఆర్థికంగా బలపరచటం జరుగుతుందని తెలిపారు. డీసీ గంగాధర్, ఏఎంఓహెచ్ శ్రీనివాస్, పీఓ రాజశేకర్, సీఓ ముస్తఫా, చెయిన్‌మెన్ మహేంద్ర, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్, వీధి వ్యాపారుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌కి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎం.ఎ.ఖదీర్, ఖలీమ్, ఆసిఫ్, బాబా ఖలీం, షాజీర్, యాసిన్ అహ్మద్‌లు గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరుతో ప్రజలు విసుగెత్తిపోతున్నారని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వసనీయత కోల్పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి చెందుతుందనే ఆశాభావంతో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరామని తెలిపారు.

రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ దీన్‌దయాల్‌నగర్‌బస్తీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ. 40 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో దీన్‌దయాల్ నగర్ బస్తీ ముంపు బారిన పడేదన్నారు. స్థానికంగా ఉన్న రోడ్డు ఎత్తును నాలుగు అడుగుల మేర ఎత్తు పెంచి ఇళ్లు మునిగిపోకుండా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణాన్ని చేపడతామన్నారు. బస్తీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి ప్రసాద్, మాజీ అధ్యక్షులు సి.సతీష్, కాసుల మహేందర్, మాజీ కార్యదర్శి పోచారం అశోక్ కుమార్, సురేందర్, శివ యాదవ్, లక్ష్మణ్, రాజేష్, రాజేష్ రెడ్డి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



మియాపూర్: నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో గురునాథం చెరువు సుందరీకరణ పనులను హైడ్రా అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో 64 చెరువులున్నాయని, దశలవారీగా అన్ని చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. హైడ్రా డీఈ నాగరాజు, మోహన్, హైడ్రా టెక్నికల్ కన్సల్టెంట్ యూనిస్, నాయకులు మోహన్ ముదిరాజ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ సభ్యులు తదితరులున్నారు.